ఆక్రమణల తొలగింపులో రాజీలేదు

- మురుగు పారుదలకు అడ్డుగా ఉన్న వాటిని నూరుశాతం తొలగిస్తాం
- నగర కమిషనర్ పులి శ్రీనివాసులు


అధికారులకు ఆదేశాలు జారీ చేస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో ప్రధాన రోడ్ల వెంబడి డ్రెయిన్లు, రోడ్ల ఆక్రమణలను తొలగించడంలో రాజీ పడేదే లేదని, వర్షం నీరు, మురుగు సక్రమంగా పారుదలకు అడ్డుగా ఉన్న ఆక్రమణలను నూరు శాతం తొలగించడానికి వార్డు సచివాలయాల వారీగా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. మంగళవారం నల్ల చెరువు మెయిన్ రోడ్ అన్న క్యాంటీన్ నుంచి పీకల వాగు వరకు ఇరువైపులా పర్యటించి, డ్రెయిన్ మీద, ముందుకు ఉన్న ఆక్రమణలను తొలగించాలని పట్టణ ప్రణాళిక అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఇప్పటికే వర్షాకాలం దృష్ట్యా డ్రెయిన్లలో పూడికతీత పనులు చేపట్టామని, డ్రెయిన్లపై ఆక్రమణలు పనులకు ఆటంకంగా ఉన్నందున స్వచ్ఛందంగా తొలగించుకోవాలని పలుమార్లు ఆక్రమణదారులకు తెలిపినప్పటికీ తొలగించుకోవడం లేదన్నారు.

ఆక్రమణలు పునరావృతం కాకుండా చర్యలు

ప్రధానంగా నల్లచెరువు మెయిన్ రోడ్‌లో మేజర్ అవుట్ ఫాల్ డ్రెయిన్‌పై ఆక్రమణల వలన పూడిక తీత వీలు కాలేదని, ఫలితంగా ప్రస్తుత వర్షాలకు నీరు డ్రెయిన్లలోకి వెళ్లడానికి వీలు లేక ఇళ్లల్లోకి వచ్చి స్థానికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆయా ఆక్రమణలను పట్టణ ప్రణాళిక అధికారులు నూరు శాతం తొలగించాలని, ఆక్రమణల తొలగింపు అనంతరం పూడికతీత చేపట్టాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. తొలగించిన ప్రాంతాల్లో ఆక్రమణలు పునరావృతం కాకుండా పట్టణ ప్రణాళిక కార్యదర్శులు, అధికారులు మెరుగైన పర్యవేక్షణ చేయాలని, విధుల్లో నిర్లక్ష్యంగా ఉంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ పర్యటనలో ఎస్ఈ నాగ మల్లేశ్వరరావు, సిటీ ప్లానర్ రాంబాబు, డీసీపీ సూరజ్ కుమార్, ఏసీపీ వెంకటేశ్వరరావు, డీఈఈ వెంకటరమణ, కార్పొరేటర్ నిమ్మల వెంకట రమణ, ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక, ప్రజారోగ్య అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

తప్పుడు మాటలు మాట్లాడటం సరికాదు



మహిళలకు ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయకుండా కూటమి నేతలు తప్పుడు మాటలు మాట్లాడటం సరి కాదు. అమలు చేయలేనప్పుడు హామీలు ఇవ్వడం దేనికి? మహిళలకు లెక్కలేనన్ని హామీలు ఇచ్చి, వారిని నిలువునా మోసం చేశారు. ఆడ బిడ్డ నిధికి సంబంధించి మంత్రి అచ్చెన్నాయుడు చేసిన వ్యాఖ్యలను పూర్తిగా ఖండిస్తున్నాం. పథకాలు ఇవ్వకపోగా, అసభ్యకర వ్యాఖ్యలు చేస్తారా? మహిళా సమాజాన్ని కించపరిచేలా మంత్రి అచ్చెన్నాయుడు వ్యాఖ్యలు ఉన్నాయి. ఇది ఏమాత్రం సరికాదు. ప్రజాస్వామ్యవాదులు రాజకీయాలకతీతంగా మంత్రి వ్యాఖ్యలను ఖండించాలి.

– షేక్ నూరి ఫాతిమా, వైఎస్సార్ సీపీ గుంటూరు నగర అధ్యక్షురాలు

ప్రజా సమస్యలు పట్టని ప్రభుత్వం

- చిన్న వర్షానికే చెరువుల్లా మారుతున్న రోడ్లు, నివాసాలు
- సంగడిగుంటలో పర్యటించిన వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు షేక్ నూరిఫాతిమా

పట్నంబజారు: రెండు రోజులు కురిసిన వర్షానికే నగరం సముద్రాన్ని తలపిస్తోందని, పాలకులు, అధికారుల నిర్లక్ష్యంతో ఈ పరిస్థితి దాపురించిందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షురాలు, తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం నియోజకవర్గంలోని సంగడిగుంట పరిసర ప్రాంతాల్లో పర్యటించారు. సంగడిగుంట 1, 2 లైన్లలో మురుగునీటి పారుదల వ్యవస్థ సరిగా లేక నీరు నిలిచిపోవటాన్ని గమనించారు. నివాసాల్లోకి సైతం వర్షపు, మురుగునీరు చేరుతోందని స్థానికులు నూరిఫాతిమా దృష్టికి తీసుకొచ్చారు. అధికారులకు పలుమార్లు సమస్యను వివరించినా.. ఎటువంటి స్పందన లేకుండా పోయిందని తెలిపారు. దీనిపై స్పందించిన నూరిఫాతిమా స్థానికుల ఇబ్బందులను కార్పొరేషన్, జిల్లా ఉన్నతస్థాయి అధికారుల దృష్టికి తీసుకుని వెళ్తామని తెలిపారు. ఈ సందర్భంగా నూరిఫాతిమా మాట్లాడుతూ ప్రజలు ఇబ్బందులు పడుతున్నా.. ఎమ్మెల్యే నసీర్‌అహ్మద్, అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరించటం సిగ్గుచేటన్నారు. శివారు ప్రాంతాల పరిస్థితి మరింత అధ్వానంగా ఉందని, దోమలు వ్యాప్తి చెంది ప్రజలకు ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. నియోజకవర్గంలో సమస్యల పరిష్కారం కోసం ఉన్నతాధికారులను కలిసి విన్నవిస్తామని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్ సీపీ నేతలు పాల్గొన్నారు.

ప్రజలను నిలువునా వంచించారు..


స్కానర్లు ఆవిష్కరిస్తున్న నూరిఫాతిమా, నేతలు

పట్నంబజారు: ఎన్నికల సమయంలో అడ్డు అదుపు లేని వాగ్దానాలు చేసి ప్రజలను నిట్టనిలువునా వంచించిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతోందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షురాలు, తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా విమర్శించారు. ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని తన కార్యాలయంలో మంగళవారం 7, 53 డివిజన్లకు సంబంధించి బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో నూరిఫాతిమా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును ప్రజలకు వివరించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఎన్నికల సమయంలో ఎన్నో వాగ్దానాలు ఇచ్చి, ఒక్కటి కూడా అమలు చేయలేని దుస్థితిలో కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తుందని మండిపడ్డారు. పైగా తాము హామీలు పూర్తి చేశామని, ఎవరైనా పూర్తి చేయలేదంటే వారి నాలుక మందమని చంద్రబాబు వ్యాఖ్యానించడం సిగ్గుచేటన్నారు. రానున్న రోజుల్లో కూటమి సర్కార్‌కు బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు, వైఎస్సార్ సీపీ నేతలు, డివిజన్ అధ్యక్షులు పాల్గొన్నారు.


సంగడిగుంటలో స్థానికుల సమస్యలు తెలుసుకుంటున్న నూరిఫాతిమా

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కొరిటిపాడు: రోడ్ వైడింగ్ వర్క్‌లో భాగంగా గుంటూరు డీ12 సెక్షన్ పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని విద్యుత్ శాఖ అధికారులు మంగళవారం తెలిపారు. ఆర్‌అండ్‌బీ మిర్చియార్డు, అంకిరెడ్డిపాలెం, ఆదర్శనగర్, మహర్షి దయానందనగర్ తదితర ప్రాంతాల్లో బుధవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

28న వ్యాసరచన, పోస్టర్ పెయింటింగ్ పోటీలు

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 28న ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయ పరిధిలోని డిగ్రీ కళాశాలల విద్యార్థులకు వ్యాసరచన, పోస్టర్ పెయింటింగ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు టీజేపీఎస్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బీవీహెచ్ కామేశ్వరశాస్త్రి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ది ఇంపార్టెన్స్ ఆఫ్ ప్రొటెక్టింగ్ నేచర్ ఫర్ ఫ్యూచర్ జనరేషన్స్ అనే అంశంపై వ్యాసరచన, ఎన్విరాన్‌మెంట్ ప్రొటక్షన్ అనే అంశంపై పోస్టర్ పెయింటింగ్ పోటీలకు ప్రతి కళాశాల నుంచి ఒక ఈవెంట్‌కు ముగ్గురు చొప్పున విద్యార్థులు పాల్గొనవచ్చని తెలిపారు. పోస్టర్ పెయింటింగ్‌కు సంబంధించి చార్టులను కళాశాలలో అందిస్తామని, ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందజేస్తామన్నారు. పోటీల్లో పాల్గొన్న విద్యార్థులందరికీ ప్రశంసా పత్రాలు, ప్రోత్సాహక బహుమతులు అందేస్తామని, పోటీల్లో పాల్గొనే ఆసక్తి గల విద్యార్థులు ఈనెల 27వ సాయంత్రం లోపు గుంటూరు జిల్లా నోడల్ అధికారి డాక్టర్ జేవీ సుధీర్ కుమార్ (98498 54221)ను సంప్రదించాలని సూచించారు.

వర్షపు నీటిని తొలగించాలి



లక్ష్మీపురం: నగరంలో ఇటీవల కురిసిన వర్షానికి అంతర్గత వీధుల్లో నిలిచిన వర్షపు నీటిని వెంటనే తొలగించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యురాలు లక్కా అరుణ డిమాండ్ చేశారు. పాత గుంటూరు శ్రామిక నగర్‌లో మంగళవారం ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్పొరేషన్ అధికారులు పాత గుంటూరులోని శ్రామిక నగర్, యన్నం వారి వీధి, చెన్నం వారి వీధి, బాలాజీ నగర్, లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీటిని తొలగించేందుకు శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. పాత గుంటూరులోని పలు ప్రాంతాల్లో కలుషిత నీరు సరఫరా అవుతోందని, కలుషిత తాగునీరు కారణంగా ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని అన్నారు. నగర పాలక సంస్థ అధికారులు సమస్యను గుర్తించి పరిష్కరించాలని కోరారు.

హైకోర్టు స్టే ఉన్నా తొలగింపు



నెహ్రూనగర్: కాకుమానువారితోట 5వ లైనులో సుమారు 320 గజాల ప్రైవేట్ వ్యక్తుల స్థలంలో నగరపాలక సంస్థ అధికారులు దౌర్జన్యంగా రోడ్డు వేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఇక్కడ రోడ్డు వేయవద్దని స్థానికులు హైకోర్టుకు వెళ్లగా.. హైకోర్టు స్టే విధించింది. స్టే ఉత్తర్వులను బట్టి స్థల యజమానులు అక్కడ రోడ్డు వేయకుండా కర్రలు, రాళ్లు అడ్డు పెట్టారు. అయితే స్టే ఉన్నప్పటికీ మంగళవారం నగరపాలక సంస్థ అధికారులు అక్కడ రోడ్డుకు అడ్డంగా పెట్టిన కర్రలు, రాళ్లను తొలగించి, రోడ్డు వేసేందుకు ఉపక్రమించారు. దీనిపై టౌన్ ప్లానింగ్ సెక్రటరీ లక్ష్మణస్వామిని వివరణ కోరగా.. స్థల యజమానుల ఆమోదంతోనే రోడ్డు క్లియర్ జరిగిందని తెలిపారు.

జిల్లా కోర్టు సిబ్బందికి సన్మానం



గుంటూరు లీగల్: ఐదవ కోర్టు నుంచి బదిలీపై వెళ్తున్న సూపరింటెండెంట్ హనుమంతరావు, కోర్టు గుమస్తాలు శివరామయ్య, సలాం, మీర్ బేగ్, ఉమాదేవిలకు మంగళవారం కోర్టు ప్రాంగణంలో ఘన సన్మానం జరిగింది. కార్యక్రమంలో ఐదో అదనపు మేజిస్ట్రేట్ కోర్టు జడ్జి కె.లత ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ నలుగురు గుమస్తాలు, సూపరింటెండెంట్ హనుమంతరావులు గత మూడు సంవత్సరాలుగా కోర్టులో అత్యుత్తమంగా సేవలు అందించారన్నారు. నిబద్ధతతో పనులు నిర్వహించి మంచి పేరు తెచ్చుకున్నారని కొనియాడారు. కోర్టు పని తీరు మెరుగుపడేందుకు వీరి సహకారం ఎంతో ఉపయుక్తమైందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కోర్టు సిబ్బంది, సహచరులు వారికి శుభాకాంక్షలు తెలియజేశారు.

తీర్థ మహత్యంపై ఆధ్యాత్మిక ప్రవచనం


మాట్లాడుతున్న కూర్మనాథస్వామి

నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వర స్వామి దేవాలయ ప్రాంగణం పద్మావతి కళ్యాణ వేదికపై మహాభారతం అరణ్యపర్వంలోని తీర్థమహత్యంపై మంగళవారం ఆధ్యాత్మిక ప్రవచనం చేపట్టారు. ఆలయ కమిటీ సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమం ప్రారంభించారు. ఆధ్యాత్మికవేత్త గుదిమెళ్ళ శ్రీకూర్మనాథస్వామి ప్రసంగిస్తూ అరణ్య పర్వంలో ధర్మరాజు నారదమహర్షిని తీర్థమహత్యాలను తెలుపమని అడగ్గా, పూర్వ పులస్త్యుడు భీష్ముడికి చెప్పిన తీర్థరాజ మహాత్యాలను వివరించారని అన్నారు. మహాభారతంలో తీర్థ మహత్యమనేది తీర్థ యా త్రల ప్రాముఖ్యత, మహిమను వివరిస్తుందని పేర్కొన్నారు. ఇది ఒక ఆధ్యాత్మిక ప్రయాణమని, ఇక్కడ పాండవులు తీర్థయాత్రలు చేసి పవిత్ర స్థలాలను సందర్శిస్తారని చెప్పారు. ఈ ప్రయాణంలో వారు నదులు, సరస్సులు, పుణ్యక్షేత్రాలను సందర్శించారని పేర్కొన్నారు. తీర్థయాత్రలు వారి జీవితాలపై, ఆధ్యాత్మిక ఎదుగుదలపై గొప్ప ప్రభావాన్ని చూపుతాయని అన్నారు. ఆధ్యాత్మికంగా ఎదిగేందుకు సహాయపడతాయని, పాపాలు తొలగిపోతాయని నమ్ముతారని పేర్కొన్నారు. తీర్థయాత్రలకు వెళ్లేటప్పుడు వాటి ప్రాముఖ్యత, చరిత్ర తెలుసుకోవడం ద్వారా జ్ఞానం, జ్ఞానోదయం లభిస్తుందని చెప్పారు.

అంతరిక్ష పరిశోధనలపై ఆసక్తి పెంచుకోవాలి


అంతరిక్ష విజ్ఞానంపై పోస్టర్లు ఆవిష్కరిస్తున్న శాంతమూర్తి, తదితరులు

గుంటూరు ఎడ్యుకేషన్: అంతరిక్ష పరిశోధనలపై విద్యార్థులు ఆసక్తి పెంచుకోవాలని చిల్డ్రన్ స్పేస్ క్లబ్ ఆఫ్ ఇండియా వ్యవస్థాపకుడు జి.శాంతమూర్తి అన్నారు. మంగళవారం పట్టాభిపురంలోని మోరియా హైస్కూల్లో విద్యార్థులతో కలిసి అంతరిక్ష విజ్ఞానానికి సంబంధించిన పోస్టర్లు ఆవిష్కరించారు. ఈసందర్భంగా శాంతమూర్తి మాట్లాడుతూ 2007లో మోరియా హైస్కూల్ ప్రిన్సిపాల్‌గా పని చేసిన తాను తిరిగి 17 ఏళ్ల తరువాత పాఠశాలను సందర్శించడం ఆనందంగా ఉందన్నారు. అంతరిక్ష జ్ఞానం అనంతమైనదని, సృష్టి రహస్యాలను తెలుసుకునేందుకు మానవుడు ఆది నుంచి పరిశోధనలు చేస్తున్నాడని అన్నారు. అంతరిక్ష ప్రయోగాలు అద్భుతమని, భారత అంతరిక్ష పరిశోధనల్లో ఇస్రో చేస్తున్న కృషిని విద్యార్థులు తప్పక తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎన్నారై డాక్టర్ పాల్ దాసరి, ఉపాధ్యాయులు ప్రసన్న కుమారి తదితరులు పాల్గొన్నారు.

మూడు వంతెనల సమస్యకు రైల్వేశాఖ పరిష్కారం చూపాలి


అధికారులతో సమావేశమైన కమిషనర్ పులి శ్రీనివాసులు, మేయర్ రవీంద్ర, ఎమ్మెల్యే నసీర్

నెహ్రూనగర్: గుంటూరు నగరంలోని డొంక రోడ్డు వద్దనున్న మూడు వంతెనల వద్ద వర్షం నీరు నిలిచి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, అందుకు పరిష్కారంగా రైల్వేశాఖ తక్షణ చర్యలు తీసుకోవాలని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర, కమిషనర్ పులి శ్రీనివాసులు, గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మహ్మద్ నసీర్‌లు స్పష్టం చేశారు. మంగళవారం నగరపాలక సంస్థ కమిషనర్ చాంబర్‌లో రైల్వే ఇంజినీర్లు, నగరపాలక సంస్థ ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక అధికారులతో 3 వంతెనల దగ్గర డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డొంక రోడ్డు వద్ద మూడు వంతెనల మార్గంలో రైల్వేశాఖ ట్రాక్ ఎక్స్‌టెన్షన్ నిమిత్తం చేపట్టిన పనుల్లో భాగంగా డ్రెయిన్‌ను పూర్తి స్థాయిలో నిర్మాణం చేయకపోవడం వలన ప్రజలు వర్షాలు వచ్చినప్పుడు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. త్వరలో శంకర్ విలాస్ బ్రిడ్జి పనులు పూర్తిస్థాయిలో చేపడితే గుంటూరు పశ్చిమ, తూర్పు నియోజకవర్గాల అనుసంధాన మార్గంగా ఉన్న మూడు వంతెనల మార్గం మరింత రద్దీగా మారుతుందని, అప్పుడు వర్షాలు పడి నీరు నిలబడితే ట్రాఫిక్ విపరీతంగా జామ్ అవుతుందన్నారు. వెంటనే డ్రెయిన్ డైవర్షన్ పనులు ప్రారంభించాలన్నారు. ఈ సమావేశంలో సిటీ ప్లానర్ రాంబాబు, ఈఈలు సుందర్రామిరెడ్డి, కోటేశ్వరరావు, రైల్వే ఇంజినీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ



పౌష్టికాహారం పంపిణీ చేసిన రోటరీ అచీవర్స్ ప్రతినిధులు

గుంటూరు ఎడ్యుకేషన్: రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు అచీవర్స్ ఆధ్వర్యంలో మంగళవారం విద్యానగర్‌లోని ఎన్నారై ఇండియన్ స్ప్రింగ్స్ స్కూల్లో నిర్వహించిన కార్యక్రమంలో 50 మంది గర్భిణులకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. ఈసందర్భంగా రోటరీ క్లబ్ సర్వీస్ ప్రాజెక్టు డైరెక్టర్ నాగార్జున కపిల్ మాట్లాడుతూ క్రమం తప్పకుండా పౌష్టికాహారాన్ని తీసుకోవడం ద్వారా తల్లితో పాటు పుట్టబోయే బిడ్డ ఎదుగుదల చక్కగా ఉంటుందని తెలిపారు. పౌష్టికాహారాన్ని క్రమంగా తీసుకోనట్లయితే పిల్లలు రకరకాల రుగ్మతలతో జన్మించే అవకాశ ఉందని, ఫలితంగా జీవితాంతం పిల్లలతో పాటు తల్లిదండ్రులు సైతం బాధపడాల్సి వస్తుందన్నారు. పౌష్టికాహారాన్ని తీసుకునే విధానం, ఏ మోతాదులో తీసుకుంటే తల్లికి, బిడ్డకు సక్రమంగా అందుతుందనే విషయాలను ఆయన వివరించారు. ఈసందర్భంగా ఖర్జూరాలు, వేరుసెనగ చిక్కీలు, కోడిగుడ్లు, మల్టీ గ్రెయిన్ లడ్డూలు, ప్రొటీన్ పౌడర్, రాగి లడ్డూలు, బ్రెడ్, ఐరన్, బి.కాంప్లెక్స్ ట్యాబెట్లతో కూడిన పౌష్టికాహార కిట్లను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు కొండపనేని విజయకృష్ణ, కార్యదర్శి గోనుగుంట్ల వెంకట్, కోశాధికారి కటకం రాజేష్, క్లబ్ పూర్వ అధ్యక్షులు పిడికిటి తిలక్ బాబు, నల్లూరి సాంబశివరావు, పూర్వ కోశాధికారి గుంటుపల్లి రఘునాద్ పాల్గొన్నారు.

అన్నివయస్సుల వారికీ మెదడు వ్యాధులు


మాట్లాడుతున్న డాక్టర్ పమిడిముక్కల విజయ

గుంటూరు మెడికల్: మెదడు సంబంధిత వ్యాధులు పుట్టిన నాటినుంచి వృద్ధాప్య దశ వరకు ఎవరినైనా ప్రభావితం చేయగలవని లలితా సూపర్‌స్పెషాలిటీ హాస్పటల్స్ న్యూరో సైన్సెస్ విభాగాధిపతి, ఇండియన్ స్ట్రోక్ అసోసియేషన్ (ఐఎస్ఏ) జాతీయ అధ్యక్షురాలు డాక్టర్ పమిడిముక్కల విజయ అన్నారు. వరల్డ్ బ్రెయిన్ డే సందర్భంగా మంగళవారం గుంటూరు కొత్తపేటలోని లలితా సూపర్ స్పెషాలిటీ హాస్పటల్‌లో అవగాహన సదస్సు జరిగింది. సదస్సులో డాక్టర్ విజయ మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా అంగవైకల్యం కలిగించే ప్రధాన కారణాలు, రెండవ అత్యధిక మరణాల కారకాలు బ్రెయిన్ జబ్బులేనని పేర్కొన్నారు. ప్రపంచఆరోగ్యసంస్థ అంచనాప్రకారం, ప్రపంచ వ్యాప్తంగా 100 కోట్లకు పైగా మంది నాడీ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్నారని చెప్పారు. సీనియర్ న్యూరోసర్జన్ డాక్టర్ ఎన్. శ్రీనివాసరావు, న్యూరాలజిస్టులు డాక్టర్ ఉషాకిరణ్, డాక్టర్ రేష్మా, డాక్టర్ అజ్మా, సైకియాట్రిస్ట్ డాక్టర్ అజయ్ మాట్లాడారు. న్యూరోసర్జన్ డాక్టర్ స్రుజన డిస్ సిండ్రోమ్‌ల గురించి వివరించారు. ప్లాస్టిక్ సర్జన్ డాక్టర్ రత్నాకర్, నర్వ్ రిపేర్ పద్ధతుల గురించి వివరించారు.

నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి



గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని ప్రముఖ మోటివేషనల్ స్పీకర్ అనంతరామయ్య పేర్కొన్నారు. మంగళవారం సంగడిగుంటలోని గుంటూరు చలమయ్య – సాధు సుబ్రహ్మణ్యం ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు యువజన సర్వీసుల శాఖ గుంటూరుజిల్లా శాఖ ఆధ్వర్యంలో వ్యక్తిత్వ వికాసం, కెరీర్ మార్గదర్శకాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా పాఠశాల హెచ్ఎం టి.రమాదేవి అధ్యక్షతన జరిగిన సదస్సులో అనంతరామయ్య మాట్లాడుతూ తల్లిదండ్రుల ఆశయాలు, ఆకాంక్షలను గుర్తించి విద్యార్థి దశ నుంచే ప్రణాళికాబద్ధమైన చదువుతో పాటు స్థిరమైన లక్ష్యంతో ముందుకు వెళ్లాలని సూచించారు. సృజనాత్మక శక్తిని మేల్కొలిపి భవిష్యత్తును తీర్చిదిద్దుకునేందుకు అవసరమైన సలహాలు, సూచనలు చేశారు. యువజన సర్వీసుల శాఖ జిల్లా మేనేజర్ బి.రాధిక మాట్లాడుతూ విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలను ప్రేరేపించి, కెరీర్‌ను తీర్చిదిద్దుకునేందుకు అవసరమైన ప్రోత్సాహాన్ని ఇచ్చేందుకు విద్యాసంస్థల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నాయకత్వ లక్షణాలపై సైకాలజిస్టులు, మోటివేషనల్ స్పీకర్ల ద్వారా అవగాహన కలిగించి, చైతన్యపరుస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహా జనసభ నిర్వహణ, కార్యవర్గ ఎన్నిక చట్ట విరుద్ధం

నెహ్రూనగర్: దేశీయ విశ్వబ్రాహ్మణ పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో గత ఆదివారం నిర్వహించిన మహాజన సభతో పాటు కొంతమంది వ్యక్తులు కూడుకుని కార్యవర్గాన్ని ప్రకటించుకోవడం చట్ట వ్యతిరేకమని వారికి నోటీసులు అందించినట్లు శ్రీ ఆంధ్ర రాష్ట్ర దేశీయ విశ్వబ్రాహ్మణ సమాజం అధ్యక్షుడు కందుకూరి లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. మంగళవారం అరండల్ పేట సమాజం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అత్యవసర కార్యవర్గ సమావేశంలో లక్ష్మీనారాయణ మాట్లాడుతూ తమను వ్యతిరేకించే వారు మహాజన సభ పెట్టుకోవాలంటే కనీసం నెలరోజుల ముందు నోటీసు ఇవ్వాలన్న ఆలోచన రాకపోవడం న్యాయ సమ్మతం కాదన్నారు. కార్యదర్శి మేడూరి శివరామకృష్ణ మాట్లాడుతూ శ్రీ ఆంధ్ర రాష్ట్ర దేశీయ విశ్వబ్రాహ్మణ సమాజంలో సభ్యులు కాని వారు, ఓటు హక్కు లేని వారు పరిరక్షణ కమిటీ పేరుతో తమను తాము పాలకవర్గంగా ప్రకటించుకోవడం సమాజ బైలా నిబంధనలకు, లోక్ అదాలత్ తీర్పుకు వ్యతిరేకంగా ఉన్నందువల్ల వారి కార్యవర్గానికి ఎటువంటి గుర్తింపు లేదని గుంటూరు నగర పరిసర ప్రాంత విశ్వబ్రాహ్మణ సంఘీయులు తెలుసుకోవాలని కోరారు. మావేశంలో ఉపాధ్యక్షులు పూసపాటి శేషగిరిరావు, సహాయ కార్యదర్శి వంగిపురపు వీర బ్రహ్మాచారి, సభ్యులు మచ్చ శివాజీ, వేల్పూరి శివరామకృష్ణ, సున్నం మల్లికార్జునరావు, సున్నం శ్రీనివాస్, నల్లపాటి బ్రహ్మం, దాసు రామకృష్ణాచారి, వంగల వీర బ్రహ్మాచారి, నిమ్మగడ్డ సుబ్బారావు, సిద్దు సాంబశివరావు, కూరపాటి కామాక్షి శర్మ, సిద్దు శ్రీకాంత్, కోటమురళి, పొన్నపల్లి హనుమంతరావు పాల్గొన్నారు.

రజకులకు సామాజిక రక్షణ చట్టం తేవాలి

మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు విజ్ఞప్తి

లక్ష్మీపురం: 2024 సాధారణ ఎన్నికలకు ముందు తెలుగుదేశం కూటమి ప్రభుత్వం తమ ఎన్నికల ప్రణాళికలో ఇచ్చిన హామీ ప్రకారం రజకులకు సామాజిక రక్షణ చట్టం వెంటనే ఏర్పాటు చేయాలని మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు డిమాండ్ చేశారు. గుంటూరు పాతగుంటూరులోని రజక వృత్తిదారుల సంఘ కార్యాలయంలో జిల్లా కమిటీ (సీఐటీయూ) ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కులగణన వెంటనే పూర్తి చేసేందుకు తగు చర్యలు చేపట్టి, సామాజిక సేవ వృత్తిలో ఉన్న రజకులకు ప్రత్యేకంగా నిధులు కేటాయించి ఆ తరగతి ప్రజల అభివృద్ధికి కృషి చేయాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ప్రణాళికలో పేర్కొన్న హామీ ప్రకారం రజకులకు సామాజిక రక్షణ చట్టం వెంటనే ఏర్పాటు చేసి నేటి అగ్రవర్ణాల నుంచి వివిధ పట్టణాలలో, నగరాలలో అపార్ట్‌మెంట్‌లలో వాచ్‌మెన్‌లుగా పనిచేస్తున్న రజకులపై సామాజిక దాడుల నుంచి రక్షించేందుకు వెంటనే సామాజిక రక్షణ చట్టం తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు.

మంత్రుల కమిటీతో కాలయాపన

రజక సామాజిక తరగతి ప్రజల అభివృద్ధికి బ్యాంకు రుణాలు మంజూరు చేస్తూ, వృత్తికి సంబంధించిన సాంకేతిక పరికరాలను సప్లై చేసి వారి అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అపార్ట్‌మెంట్ వాచ్‌మెన్‌లకు వర్తించే విధంగా నిర్దిష్ట చర్యలు చేపట్టాలని, అలాగే లాండ్రీ వృత్తిదారులకు నెలకు 250 యూనిట్లు తెలంగాణ ప్రభుత్వం ఇస్తున్న విధంగా ఉచిత కరెంటు సప్లయి చేయాలని ఇటువంటి సంక్షేమ పథకాలు అమలు జరపడం ద్వారానే రజకులు అభివృద్ధి చెందుతారన్నారు. ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మన్నూరు భాస్కరయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి సంవత్సర కాలం పూర్తయినప్పటికీ ఎన్నికల ప్రణాళికలో పేర్కొన్న వాగ్దానాలు అమలు జరపకుండా కేవలం మంత్రులతో కమిటీ ఏర్పాటు చేసి కాలయాపన చేస్తున్నారన్నారు. ఆగస్టు 25న అన్ని జిల్లాల కలెక్టర్ కార్యాలయాల వద్ద ధర్నాలు నిర్వహించి ప్రభుత్వానికి రజక వృత్తిదారుల ఆవేదన తెలియజేస్తామన్నారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఈమని అప్పారావు, అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం జిల్లా కార్యదర్శి ఎల్ అరుణ,రజక వృత్తిదారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బొజ్జ సుబ్బారావు, సంఘం గుంటూరు జిల్లా గౌరవ సలహా దారులు నిదుబ్రోలు సాంబశివరావు తదితరులు ప్రసంగించారు.

వర్షం నీరు మీదపడిందని ఇరువర్గాల ఘర్షణ

లక్ష్మీపురం: వర్షం నీరు మీదపడిందని ఇరు వర్గాలు కర్రలు, రాడ్లతో కొట్టుకున్న ఘనటపై అరండల్‌పేట పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సంజీవయ్యనగర్‌కు చెందిన అఖిల్ అనే యువకుడు ద్విచక్రవాహనంపై వర్షపు నీటిలో వేగంగా ప్రయాణిస్తున్నాడు. అదే రోడ్డులో ఉన్న రవి అనే యువకుడి మీద వర్షపు నీరు పడటంతో రవి అఖిల్‌ని ప్రశ్నించగా.. ఇద్దరి మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. దీంతో ఇరువురి మధ్య గొడవ జరిగి ఒకరినొకరు కర్రలు, ఇనుప రాడ్లతో కొట్టుకుని గాయాలు పాలై ఇరు వర్గాలు అరండల్‌పేట పోలీస్ స్టేషన్‌లో ఒకరిపై ఒకరు ఫిర్యాదులు చేసుకున్నారు. ఇరు వర్గాలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముఠా కార్మిక సంఘం మహాసభ

లక్ష్మీపురం: భారత కమ్యూనిస్టు పార్టీ ముఠా కార్మిక సంఘం నగర శాఖ మహాసభ గుంటూరు సంగడిగుంటలోని రేగుల రాఘవయ్య భవన్‌లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ మాట్లాడుతూ కేంద్ర కార్పొరేట్ శక్తులకు వ్యతిరేకంగా సీపీఐ నిరంతరం పోరాడుతుందన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం తమ హామీలను పూర్తి స్థాయిలో అమలు చేయకపోవడం మోసం చేయడమేనన్నారు. ముఠా కార్మిక సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నాయకులు చల్లా చినాంజనేయులు, జి.సురేష్ బాబు, నగర కమిటీ సభ్యులు ఆకిటి అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

డీఎంహెచ్‌ఓకు ఘన సత్కారం


డీఎం హెచ్ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మిని సన్మానిస్తున్న ఏపీ ఎన్జీఓ నేతలు

గుంటూరు మెడికల్: ఇటీవల జరిగిన హెల్త్ సెక్రటరీల బదిలీలు అందరికీ ఆమోదయోగ్యంగా నిర్వహించిన జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారిణి డాక్టర్ కొర్రా విజయలక్ష్మిని ఏపీ ఎన్జీఓ నేతలు సన్మానించారు. డీఎంహెచ్ఓ కార్యాలయంలో మంగళవారం డాక్టర్ కొర్రా విజయలక్ష్మిని ఘనంగా సత్కరించారు. హెల్త్ సెక్రటరీలు, హెల్త్ సెక్రటరీ విభాగ నాయకులు ఏపీ ఎన్జీఓ అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాసరావు, జిల్లా సెక్రటరీ శ్యాంసుందర్ శ్రీనివాసరావు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ షరీఫ్, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ కె.ఎస్.సుకుమార్, జిల్లా సహాధ్యక్షుడు వెంకట్ రెడ్డి, ఉమెన్ జాయింట్ సెక్రటరీ ఎం.విజయలక్ష్మి, నగర అధ్యక్షుడు ఎస్.పి. ఎస్.సూరి, జాయింట్ సెక్రటరీలు ఎన్.రామకృష్ణ, శ్రీనివాసరావు, అమరావతి అధ్యక్షుడు ఆర్.నాగేశ్వరరావు, కార్యదర్శి షేక్ కరీం, సంఘ నాయకులు నరసింహారావు, ఏపీ ఎన్జీఓ అసోసియేషన్ మహిళ విభాగం నాయకులు పాల్గొన్నారు.